క్లుప్తంగా

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

గోకవరం: మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపల్ బేతపూడి రవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 24 వరకూ గడువు ఉందన్నారు. అభ్యర్థులు 2021–23 విద్యా సంవత్సరంలో 3, 4వ తరగతులు చదివి ఉండాలని, తూర్పుగోదావరి జిల్లాలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ఓసీ, బీసీ అభ్యర్థులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 2010 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలని వివరించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మే 20న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు 95665 59622 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు వీరవరంలో గడపగడపకూ మన ప్రభుత్వం

కిర్లంపూడి: మండలంలోని వీరవరంలో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ తోట రవి ఆదివారం తెలిపారు. ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. ఈ సందర్భంగా మండలానికి కేటాయించిన ఫ్యామిలీ ఫిజీషియన్ 104 వాహనాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, హాజరై విజయవంతం చేయాలని కోరారు.

15 నుంచి చేపల వేట నిషేధం

తొండంగి: సముద్రంలో మత్స్యసంపద అభివృద్ధి కోసం ప్రభుత్వం ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకూ చేపల వేట నిషేధాన్ని అమలు చేస్తోందని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు ఆదివారం తెలిపారు. వేట నిషేధ సమయంలో నాటు పడవలు మినహా మోటార్ బోట్లు, మెకనైజ్డ్ బోట్లతో చేపల వేట చేయరాదన్నారు. మండలంలోని మత్స్యకారులు చేపల వేట నిషేధానికి సహకరించాలని కోరారు. ఇప్పటికే దీనిపై మత్స్యకార గ్రామాల్లో ప్రచారం చేశామన్నారు. వేటనిషేధ సమయంలో ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపిస్తామని చెప్పారు.

భానుడి భగభగలు

తొండంగి: ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 8 గంటలకే భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. ఆదివారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉదయం పది గంటలకే రహదారులపై రాకపోకలు తగ్గాయి. ఉక్కబోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. వేసవి ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయని వాతావరణశాఖ ప్రకటించిన నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏవీ నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్ తెలిపారు.

వైఎస్సార్ సీపీలోకి హసన్ షరీఫ్

- 50 మందితో పార్టీలో చేరిక
- ఆహ్వానించిన ద్వారంపూడి



హసన్ షరీఫ్‌కు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ సిటీ: వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి ముస్లిం నాయకుడు హసన్ షరీఫ్ సుమారు 50 మందితో వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక రేచర్లపేట అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన తన అనుసరులు, మిత్రులతో కలసి సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ముస్లిం, మైనారిటీల్లో చురుకైన పాత్ర వహిస్తున్న హసన్ షరీఫ్ వంటి నాయకుల చేరిక పార్టీకి మరింత బలాన్ని చేకూరుస్తుందన్నారు. పార్టీలో కష్టించి పని చేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. ఇటీవల కొత్తగా పదవులు పొందిన ముస్లిం మైనారిటీ నాయకులను ఎమ్మెల్యే ద్వారంపూడి సభకు పరిచయం చేశారు. పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో ముస్లిం, మైనార్టీలకు ఎల్లప్పుడూ సముచిత స్థానం ఉంటుందన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఆయన తనయుడు సీఎం జగన్ మైనార్టీల సంక్షేమానికి ఎన్నో చర్యలు తీసుకున్నారన్నారు. అనంతరం రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ద్వారంపూడి, మాజీ మేయర్ శివప్రసన్న హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర విద్యాసాగర్, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు రెహమాన్‌ఖాన్, డైరెక్టర్లు కరీం, జాఫర్‌ఖాన్, పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు బాషా, నగర అధ్యక్షుడు ఖాలీబ్ మిన్ వలీ, వ్యాపారవేత్త ఆలీషా తదితరులు పాల్గొన్నారు.

అజొల్లా సాగు.. లాభాలు బాగు

- పాడిపంటలకు ఎంతో ఉపయోగకరం
- పశువులకు మేత, పంటలకు ఎరువుగా వినియోగిస్తున్న వైనం
- సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు
- ఉమ్మడి జిల్లాల 18 మండలాల్లో తయారీ

ప్రత్తిపాడు: వ్యవసాయ పనులకు కూలి రేట్లు పెరగడం, కూలీల కొరత, వ్యవసాయ పనుల్లో యంత్రాల వాడకం పెరగడం వల్ల ప్రస్తుతం ఎండు గడ్డి, పచ్చి గడ్డికి కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో పాడి రైతులకు అజొల్లా ఒక వరంలా మారింది. రైతులు తమ పశువులకు మేతగా అజొల్లాను వినియోగిస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 18 మండలాల్లో సుమారు 3,500 మంది రైతులు అజొల్లా తయారు చేసి పశువులకు మేతగా, ఎరువుగా వినియోగిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

విస్తృతంగా ప్రచారం

నాచు జాతికి చెందిన అజొల్లాను ఇంటి ఆవరణలోనే అత్యంత సులభంగా పెంచుకునే అవకాశం ఉంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, గొల్లప్రోలు, గోకవరం, కరప, పెదపూడి, సామర్లకోట, కాజులూరు, తాళ్లరేవు, తుని, రౌతులపూడి, అమలాపురం రూరల్, అయినవిల్లి, ముమ్మిడివరం, కోరుకొండ, అడ్డతీగల, రాజఒమ్మంగి, రంపచోడవరం మండలాల్లో పశుసంవర్ధక శాఖ, ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్), రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అజొల్లా పెంపకంపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. పాడిరైతులు అజొల్లా పెంపకం చేపట్టేలా వారికి అవగాహన కల్పిస్తున్నారు.

పెంపకం ఇలా..

అజొల్లా పెంపకానికి కావలసిందల్లా కొన్ని ఇటుకలు, ఓ టార్పాలిన్, తాగునీరు, పది కేజీల పశువుల పేడ, 200 కేజీల సారవంతమైన మట్టి, ఒక కేజీ అజొల్లా. వీటి కోసం రైతులు ఖర్చు చేయాల్సింది కేవలం రూ.1000 లోపే. సిమెంటు ఒరలు, ఇటుకలతో తయారు చేసుకున్న తొట్టెలతో అజొల్లా పిట్‌ను తయారు చేసుకోవచ్చు. గ్రామంలో ఎవరైనా దీనిని పెంచుతుంటే వారి వద్ద నుంచి కొద్దిగా అజొల్లా కల్చర్‌ను తెచ్చుకుని తయారు చేసుకున్న పిట్‌లో వేస్తే చాలు జీవిత కాలం అజొల్లా పెరుగుతూనే ఉంటుంది. అవసరాన్ని బట్టి ఇంటి ఆవరణలో ఎన్ని అజొల్లా పిట్లనైనా తయారు చేసుకోవచ్చు.

ప్రయోజనాలు

- ఆవులు, గేదెలు, మేకలు, కోళ్లతో పాటు చేపలకు ఆహారంగా ఉపయోగపడుతుంది.
- ప్రతిరోజూ పాడి గేదెలకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఒక కేజీ వంతున పాలిచ్చే పశువుకు దాణాగా పెట్టడం వల్ల దాణా ఖర్చు తగ్గడమే కాకుండా పాల దిగుబడి, వెన్న శాతం పెరుగుతాయి.
- అజొల్లాలో ప్రొటీన్లు, మాంసకృతులు అధికంగా ఉండడం వల్ల పశువు బలిష్టంగా మారుతుంది. పశువులు సమయానికి ఎదకి (సూడికి) వస్తాయి. దీని వల్ల పశు సంపద పెరుగుతుంది.
- వరి పైరుకు జీవన ఎరువుగా ఉపయోగపడుతుంది. అజొల్లాను వరి పొలంలో జల్లుకోవడం వలన ఎకరాకు 8 నుంచి 12 కిలోల నత్రజని పైరుకు అందుతుంది.
- అజొల్లాను మొక్కలకు వేస్తే వేర్లకు ఆక్సిజన్ తగినంతగా అందుతుంది. ఫలితంగా యూరియా ఉపయోగించాల్సిన అవసరం ఉండదు.
- వరి పంటలో కలుపు రాకుండా అడ్డుకోవడంలో అజొల్లా ఎంతగానో ఉపయోగపడుతుంది.



అజొల్లా పిట్లు



అజొల్లాను పశువుకు మేతగా పెడుతున్న రైతు



అజొల్లా సాగుపై రైతుకు అవగాహన కల్పిస్తున్న రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ నాగేశ్వరరావు

పంటలతో పాటు పశువులకూ మేలు



అజొల్లా వేసిన 15 రోజుల నుంచి ప్రతిరోజూ ఒక కేజీ వంతున పాడి పశువులకు దాణాగా వినియోగిస్తున్నాను. పాల దిగుబడే కాకుండా వెన్న శాతం కూడా పెరిగింది. వరి పంటలో కూడా అజొల్లా వేశాను. దీనివల్ల కలుపు బాగా తగ్గింది. యూరియాకు బదులుగా అజొల్లాను ఉపయోగించాను. ఎకరాకు రూ.6 వేల వరకూ ఖర్చు తగ్గింది.

– దేవర రాధాకృష్ణ, రైతు, పెద్దిపాలెం, ప్రత్తిపాడు మండలం

రైతులకు అవగాహన కల్పించాం



అజొల్లాను ప్రతీ రైతు పెంచుకోవాలి. దీని వల్ల రైతులు పెద్దగా కష్టపడాల్సిన అవసరం అవసరం ఉండదు. కానీ కాస్త శ్రద్ధ తీసుకోవాలి. కేవలం రూ.1000 పెట్టుబడితో అజొల్లా తయారవుతుంది. అజొల్లా పెంపకంపై 18 మండలాల్లోని రైతులకు అవగాహన కల్పించాం. సాగుపై రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. రైతులు కూడా అజొల్లా పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు.

– బర్రే నాగేశ్వరరావు, ప్రాజెక్టు మేనేజర్, రిలయన్స్ ఫౌండేషన్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా

ఆర్‌ఎంపీ వైద్యుడికి డాక్టరేట్



ఢిల్లీలో డాక్టరేట్ అందుకుంటున్న ఆర్‌ఎంపీ వైద్యుడు ప్రసాద్

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరం గ్రామానికి చెందిన రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ (ఆర్‌ఎంపీ) వైద్యుడు గుండేపల్లి ప్రసాద్‌కి గౌరవ డాక్టరేట్ లభించింది. వైద్య రంగంలో ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఢిల్లీకి చెందిన మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్ సంస్థ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. యర్రవరం పరిసర గ్రామాల్లో 35 ఏళ్లుగా ప్రసాద్ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. గౌరవ డాక్టరేట్ పొందిన ప్రసాద్‌ను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

రత్నగిరిపై సూర్యనమస్కారాలు



రత్నగిరిపై సూర్యనమస్కారాల అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న ఈఓ చంద్రశేఖర్ అజాద్

అన్నవరం: రత్నగిరి కళావేదికపై ఆదివారం సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు, సూర్యనమస్కారాలు నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేసి వివిధ భంగిమల్లో సూర్య నమస్కారాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఏలేశ్వరం: ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మండలం యర్రవరంలో వివేకానంద సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ట్రస్టు అధ్యక్షుడు మైరాల నాగేశ్వరరావు ప్రారంభించారు. ప్రస్తుత వేసవిలో వాహనదారులు, బాటసారుల సౌకర్యార్థం ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి కడలి సత్యనారాయణ, సారా శ్రీను, యర్రవరం ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

రచనలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయి



మాయ పుస్తక పరిచయ సభలో పాల్గొన్న జానకిరామ్‌చౌదరి తదితరులు

కాకినాడ కల్చరల్: రచయిత గంటేడ గౌరినాయుడు రచనలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయని సాహితీ స్రవంతి నగరశాఖ అధ్యక్షుడు మార్ని జానకిరామ్‌చౌదరి అన్నారు. స్థానిక రాజారామ్మోహన్‌రాయ్ వీధిలోని శాస్త్రి కళాప్రాంగణంలో సాహితీ స్రవంతి నగరశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రముఖ రచయిత గంటేడ గౌరునాయుడు రచించిన మాయ (కథాసంపుటి) పుస్తక పరిచయ సభ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు గనారా అధ్యక్షతన జరిగింది. పల్లెజీవన విధానాన్ని అద్దంపట్టేలా గంటేడ రచనలు ఉంటాయని శాస్త్రి సేవాపీఠం అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి అన్నారు. అనంతరం కవి సమ్మేళనం జరిగింది. పి.పద్మజావాణి, జోస్యుల కృష్ణబాబు, గరికిపాటి మాస్టార్, డా.శైలజ, మణిబాబు, అద్దేపల్లి జ్యోతి, రామస్వామి తదితర రచయితలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గ్రామాల్లో జోరుగా జగనన్నే మా భవిష్యత్

జగ్గంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని సీతానగరంలో ఆదివారం ఆయన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు గురించి గ్రామస్తులను ఆరా తీశారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారి ఇంటికి వారి అనుమతితో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతో కూడిన స్టిక్కర్లను అతికించారు. అన్ని వర్గాల సంక్షమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, జగ్గంపేట ఉప సర్పంచ్ బండారు రాజా, సచివాలయ కన్వీనర్ కరుటూరి వీర్రాజు, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు పెద్దాడ రాజబాబు, గద్దె వీరబాబు పాల్గొన్నారు.

ఇంటింటా జగనన్నే మాభవిష్యత్

ఏలేశ్వరం: నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పర్వతపూర్ణచంద్రప్రసాద్ ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ శ్రేణులు, పార్టీ గృహ సారథులు, కన్వీనర్లు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఏలేశ్వరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, పార్టీ పట్టణ కన్వీనర్ అలమండ వీరరాఘవస్వామి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. పలువురు పార్టీనాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

తొండంగి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పాలనా తీరుపై ప్రజల స్పందన తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమం ఆదివారం మండల వ్యాప్తంగా ఉత్సాహంగా సాగింది. ఏవీ నగరంలో తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళీ కృష్ణ, ఎంపీటీసీ యనమల వరహాలు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. బెండపూడిలో వైఎస్సార్ సీపీ మండల యూత్ కన్వీనర్ ఆరుమిల్లి ఏసుబాబు ఆధ్వర్యంలో జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు.

గోకవరం: మండల వ్యాప్తంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్సాహంగా నిర్వహించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వానికి మద్దతు పలికిన వారి ఇళ్లకు వారి అనుమతితో స్టిక్కర్లను అతికించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు, కన్వీనర్లు, గృహసారథుల సారధ్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. కృష్ణవరంలో సర్పంచ్ గౌరకపూడి అనితా లక్ష్మి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సీఎం వైఎస్ జగన్ ఫొటోతో కూడిన స్టిక్కర్లను ఇంటి గోడలపై అతికించారు. వైస్సార్ సీపీ నాయకులు గౌరకపూడి గోపి, గౌరకపూడి మమతా, పెంటపాటి తాతాజీ, గాబు వెంకటేశ్వరరావు, ఉంగరాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: ప్రజల ఉజ్వల భవితకు భరోసా కల్పించడమే లక్ష్యంగా జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు అన్నారు. మండలంలోని ఒమ్మంగి, రాచపల్లి, ధర్మవరం, ఉత్తరకంచి, పెద్దిపాలెం, శరభవరం గ్రామాల్లో ఆదివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు వివరించారు.



సీతానగరంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



ఏలేశ్వరంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి



ఏవీ నగరంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఒమ్మంగిలో మహిళలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు



గోకవరంలో నువ్వే మా నమ్మకం జగన్ స్టిక్కర్‌ను తన ఇంటి గోడకు అతికిస్తున్న వృద్ధురాలు

రైతులకు సన్మానం

కిర్లంపూడి: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని ఆదివారం ఆ పార్టీ నాయకులు బూరుగుపూడిలో రైతులను సన్మానించారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వై. మాలకొండయ్య ఆధ్వర్యంలో పలువురు రైతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిసాన్ సమ్మాన్ యోజనను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట వెంకట సర్వారాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల సూర్యనారాయణ, సింగిలిదేవి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



గోకవరంలో సమాధి వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు


ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఏసుక్రీస్తు సమాధి నుంచి తిరిగి వచ్చిన సందర్భంగా చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జీసస్ గీతాలను ఆలపిస్తూ రోజంతా చర్చిల్లో గడిపారు. స్థానిక కాలేజ్ రోడ్‌లోని లూథరన్ చర్చిలో పాస్టర్ సామ్యూల్ రవికుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపులను రక్షించేందుకు క్రీస్తు మళ్లీ జన్మించాడన్నారు. క్రీస్తుబోధనలు అనుసరణీయమన్నారు. స్థానిక ఆర్‌సీఎం చర్చిలో పాస్టర్ థామస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ప్రత్తిపాడు: మండల వ్యాప్తంగా క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున తమ బంధువుల సమాధులను దేదీప్యమానంగా అలంకరించారు. సమాధుల వద్ద కొవ్వొత్తులను వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిల్లో పేదలకు కానుకలు, వితంతువులకు వస్త్రాలు అందజేశారు. ప్రత్తిపాడులోని సెంటినరీ బాప్టిస్ట్, ఆర్‌సీఎం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

గోకవరం: ఈస్టర్ పండగను మండలంలోని క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని శ్మశానవాటికల్లో తెల్లవారుజాము నుంచి క్రైస్తవులు తమ కుటుంబ సభ్యుల సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గోకవరంలోని క్రైస్తవ శ్మశానవాటిక తెల్లవారుజామున కిటకిటలాడింది. చర్చిలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



ప్రత్తిపాడులో సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



ఏలేశ్వరం లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

పెంటకాలువలు

- అధ్వానంగా ప్రధాన పంటకాలువలు
- దిగువ ఆయకట్టుకు అందని నీరు
- నష్టపోతున్న రైతులు

ఏలేశ్వరం: నియోజకవర్గంలోని వేలాది ఎకరాలను సాగునీరు అందించే తిమ్మరాజుచెరువు ప్రధాన పంటకాలువలు వ్యర్థాలతో నిండిపోయి అధ్వానంగా మారాయి. కాలువల్లో అడుగడుగునా నీటి ప్రవాహానికి చెత్త, వ్యర్థాలు అడ్డుపడడంతో దిగువ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు అందడం లేదు. ఏలేశ్వరం శివారులోని తిమ్మరాజు చెరువు నుంచి సుమారు 6 వేల ఎకరాలకు నీరు అందిస్తున్నారు. మండలంలోని ఏలేశ్వరం, లింగంపర్తి, సిరిపురం, భద్రవరం, ప్రత్తిపాడు మండలం ఏలూరు తదితర గ్రామాల్లోని పొలాలకు తిమ్మరాజుచెరువు చెరువు నుంచి రెండు ప్రధాన కాలువల ద్వారా నీరు సరఫరా అవుతోంది. కాగా పంట కాలువలు అధ్వానంగా మారడంతో పొలాలకు నీరు అందడం కష్టంగా మారింది.

ఆక్రమణల చెరలో కాలువలు

దిగువ ఆయకట్టుకు సాగునీరు అందించే కాలువలు ఆక్రమణలకు గురికావడంతో నీరు ముందుకు పారడం లేదు. దీంతో నీరు అందక పంటలు నష్టపోతున్నామని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రధాన కాలువలపై కట్టడాలు నిర్మించడంతో పాటు కాలువల్లో చెత్త పేరుకుపోయింది. ఆక్రమణలు తొలగించాలని కోరుతూ రైతులు పలుమార్లు ఆందోళనలు చేశారు. అయినప్పటికీ అధికారులు స్పందించలేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వెయ్యి ఎకరాలకు అందని నీరు

ఏలేశ్వరంలో మండలంలోని సిరిపురం గ్రామానికి వెళ్లే కాలువ మరింత అధ్వానంగా మారడంతో పొలాలకు నీరు అందడం లేదు. సిరిపురంలో సుమారు వెయ్యి ఎకరాలను సాగునీరు అందడం లేదు. దీంతో రెండేళ్లుగా రైతులు పంటలను నష్టపోతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంట కాలువలను అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.



ఏలేశ్వరంలో వ్యర్థాలతో అధ్వానంగా మారిన పంట కాలువ



పంటకు సాగునీరు అందించే తిమ్మరాజుచెరువు



తుప్పలు పేరుకుపోయిన కాలువ